www.kalamjyothi.com

కలంజ్యోతి

తెలుగు దినపత్రిక

సోమవారం
28.09.2026





ప్రకృతి పులకరించే
అందాల లోకం


- నల్లమల అందాలు.. కృష్ణమ్మ జలసిరులు పరవళ్లు
- అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లో అరుదైన వన్యప్రాణులు
- సోమశిలలో జలవిహారం..
  ఉమామహేశ్వరంలో ఆధ్యాత్మికం

5లో..

- బాధ్యతతో మెలగాలి..
  ప్రకృతి సంపదను కాపాడాలి : అటవీ శాఖ

"దట్టమైన నల్లమల అరణ్యాలు, జాలువారే పాలధారల జలపాతాలు, శతాబ్దాల చరిత్ర కలిగిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలు, పరవళ్లు తొక్కే కృష్ణమ్మ జలసిరులతో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రకృతి ప్రేమికులకు భూతల స్వర్గంలా భాసిల్లుతోంది. నగర జీవన రణగొణ ధ్వనుల నుంచి కాస్తంత ఉపశమనం కోరుకునే వారికి ఇక్కడి పచ్చని కొండలు, ఆహ్లాదకరమైన చల్లని గాలులు, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోని అరుదైన వన్యప్రాణుల సందడి సరికొత్త అనుభూతిని పంచుతున్నాయి. ప్రపంచ పర్యాటక దినోత్సవం వేళ సోమశిల జలవిహారం మొదలుకొని ఫరహాబాద్ వ్యూ పాయింట్ వరకు జిల్లాలోని అద్భుత సోయగాలు, పర్యాటక రంగ అభివృద్ధి అవకాశాలు నలుమూలల నుంచి వచ్చే వేలాది మంది సందర్శకులను కట్టిపడేస్తూ విశేషంగా ఆకర్షిస్తున్నాయి."

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్



పాలమూరు రైతులను
రేవంత్ ముంచిండు

నీళ్లున్నా పంటలను ఎండబెడుతున్నారు

- ఉమ్మడి జిల్లాలో 40 శాతం పంట నష్టం
- పంపులు నడపకుండా పిల్లిలా మారారు
- రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలి

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



నదుల్లో పుష్కలంగా నీళ్లున్నా పంపులు నడపకుండా చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కారు వైఖరితో పాలమూరు నేల నెర్రలు వారి అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకవైపు సాగునీరందక ఎండిన పైర్లు, మరోవైపు కరెంట్ కోతలు, అందని రుణమాఫీతో రైతాంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో స్వయంగా పంట పొలాల్లోకి దిగి ఎండిన పంటలను పరిశీలించి, రైతుల గోడు విన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. "అన్నదాతలెవరూ అధైర్యపడొద్దు.. రైతులకు పరిహారం దక్కేంతవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదు.. అసెంబ్లీ లోపలా బయటా మీ పక్షాన పోరాడుతాం" అని స్పష్టం చేశారు.

– కలంజ్యోతి, నాగర్ కర్నూల్

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
సోమవారం 28.09.2026
2
www.kalamjyothi.com

విద్వేషాలు రేకెత్తించేందుకే రేవంత్ పర్యటన

- కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడానికే సిరిసిల్లకు వస్తున్నారు
- అన్నపూర్ణ, మధ్యమానేరు నుంచి సాగునీరు విడుదల చేయాలి
- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 27) : ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిరిసిల్ల పర్యటనకు వస్తున్నారని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ సిద్ధం వేణు, మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్ ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్న అక్కసుతోనే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులపై దిగజారుడు మాటలు మాట్లాడటానికి ప్రజాధనంతో రేవంత్ రెడ్డి సభలు పెడుతున్నారని మండిపడ్డారు.

ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే కుట్ర..

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరిగిపోతోందని, దాని నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని రసమయి ఆరోపించారు. 22ఏ పేరుతో లక్షలాది ఎకరాలను నిషేధిత జాబితాలోకి నెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి సర్కారు వసూళ్లకు పాల్పడుతోందని విమర్శించారు. కేటీఆర్ కృషితో చేనేత రంగానికి రూ.3 వేల కోట్లు కేటాయించి, మధ్యమానేరుతో సిరిసిల్లను జలకళతో నింపారని గుర్తుచేశారు. నేడు పవర్ లూం కార్మికులకు కనీస బిల్లులు చెల్లించలేని స్థితిలో సర్కారు ఉందని, సీఎం సభకు వెచ్చించే ఖర్చును నేతన్నల అభ్యున్నతికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మూడేళ్లలో నియోజకవర్గానికి నయాపైసా అభివృద్ధి చేయలేదని, నిధులు తేవడం చేతకాక దీక్షల పేరుతో నాటకాలాడుతున్నారని ఎద్దేవా చేశారు.

రైతుల కోసం వెంటనే నీళ్లు ఎత్తిపోయాలి..

కాంగ్రెస్ పాలనలో రైతులకు సాగునీరు, యూరియా కొరత తీవ్రమైందని రసమయి బాలకిషన్ ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును నిందించిన పాలకులే ఇప్పుడు నీటిని ఎలా ఎత్తిపోస్తున్నారని ప్రశ్నించారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి బిక్కవాగులోకి నీటిని ఎత్తిపోయాలని, మధ్యమానేరు కుడికాల్వ ద్వారా రైతాంగానికి సాగునీరు అందించాలని కోరారు. అన్నపూర్ణ డీ4 కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల్లోని చెరువులను తక్షణమే నింపాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పంట కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోతే రైతుల పక్షాన పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, నాయకులు చేరుకుపెల్లి రాజిరెడ్డి, బద్దం శేఖర్ రెడ్డి, సిద్ధం వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయానికి నిధులు

- శిథిలావస్థ భవనానికి మోక్షం
- ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు
- ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి



కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 27) : నాగర్‌కర్నూల్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) కార్యాలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరిన భవన పునర్నిర్మాణానికి తగిన నిధులు విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఇటీవల రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే నిధులు మంజూరు చేస్తూ జీవో నెం. 597 ఉత్తర్వులు జారీ చేయడంతో పనులకు మార్గం సుగమమైంది. నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేస్తూ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు..

నిధుల విడుదలతో నూతన హంగులతో భవనాన్ని తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పేర్కొన్నారు. కార్యాలయ పునర్నిర్మాణం పూర్తయితే అధికారులు, సిబ్బంది మరింత ఉత్సాహంగా విధులు నిర్వర్తించేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. నిత్యం వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆధునిక మౌలిక వసతులు, వేగవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. పనులను త్వరలోనే ప్రారంభించి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయిస్తామని స్పష్టం చేశారు.

రోడ్ల కోసం కదిలిన అఖిలపక్షం

- అనంతారం బ్రిడ్జి, రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలి
- నేడు కలెక్టరేట్ ముట్టడికి పాదయాత్ర



కలంజ్యోతి, ఇల్లంతకుంట (సెప్టెంబర్ 27)

:ఇల్లంతకుంట నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, అనంతారం బ్రిడ్జి, ఒగులాపూర్ కెనాల్ పనులను పూర్తి చేసి ప్రజలకు సురక్షితమైన ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్షం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు సావనపెల్లి రాకేష్ నేతృత్వంలో ఇల్లంతకుంట బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఈ యాత్ర అనంతారం, రహీంఖాన్‌పేట, ఎర్రనర్సుపల్లె మీదుగా వెల్జిపూర్ వరకు సాగింది. రహీంఖాన్‌పేట, ఎర్రనర్సుపల్లె గ్రామాల యువకులు పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికి సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. అనంతరం వెల్జిపూర్‌లో మొదటి రోజు పాదయాత్ర ముగిసింది.

నేడు కలెక్టరేట్ ముట్టడికి పాదయాత్ర..

ఈ సందర్భంగా సావనపెల్లి రాకేష్ మాట్లాడుతూ.. ఇల్లంతకుంట నుంచి వెల్జిపూర్, గుడెప్పల్లె, వల్లంపట్ల, ఒగులాపూర్ మీదుగా సిరిసిల్లకు వెళ్లే రోడ్లు పూర్తిగా గుంతలమయమై రాకపోకలు సాగించలేక నిత్యం ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు (సెప్టెంబర్ 28) వల్లంపట్ల గ్రామం నుంచి రెండో రోజు పాదయాత్ర ప్రారంభమై ఒగులాపూర్ మీదుగా రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్‌కు చేరుకుంటుందని, అక్కడికి చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ కరీంనగర్ జిల్లా కార్యదర్శి ఏనుగుల లింగన్న, సీపీఐ మండల కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతిరెడ్డి, బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొంపెల్లి పర్శరాములు, ప్రజా సంఘాల నాయకులు కముటం తిరుపతి, గరిగే శ్రీనివాస్, బత్తిని భూమేష్ గౌడ్, ఎంఆర్‌పీఎస్ నాయకులు సంగెం అనిల్, మున్నూరు కాపు సంఘం ప్రెసిడెంట్ వరల రాజు, చుక్క రమేష్, దొంతి పవన్, మడిపల్లి ప్రశాంత్, పల్లె లింగం, సంతోష్ రెడ్డిలతో పాటు ఆయా పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపం

వరద ఉద్ధృతి 8-9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం

కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 27)

: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి నది క్రమంగా ఉగ్రరూపం దాల్చుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం 8 నుంచి 9 లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రస్తుత వరద పరిస్థితులపై విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వివరాలు వెల్లడించారు.



రక్షణ చర్యల్లో బృందాలు..

ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 40 అడుగులకు చేరిందని ప్రఖర్ జైన్ తెలిపారు. కూనవరం వద్ద 14.8 మీటర్లు, పోలవరం వద్ద 9.98 మీటర్ల నీటిమట్టం నమోదైందని వివరించారు. ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 5.61 లక్షల క్యూసెక్కులుగా కొనసాగుతోందని, వరద గరిష్ఠ స్థాయికి చేరిన తర్వాత తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముంపు ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, ఉప్పొంగుతున్న వాగులు, కల్వర్టులు, కాజ్‌వేలు దాటవద్దని హెచ్చరించారు.

మొక్కల సంరక్షణే అసలైన బాధ్యత

మొక్కను బతికించి పెంచడమే నిజమైన పర్యావరణ సేవ

పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త దుంపెన రమేష్

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 27) : మొక్కలు నాటడం ఒక మంచి పని అయితే, వాటిని పెంచి సంరక్షించడం అంతకంటే గొప్ప బాధ్యత అని ఎల్లారెడ్డిపేటకు చెందిన పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త దుంపెన రమేష్ అన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు పెంచుతూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం తన ఇంటి ముందు స్వయంగా పెంచిన వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను పలువురికి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుంపెన రమేష్ మాట్లాడుతూ.. మొక్కలు నాటడంతోనే బాధ్యత పూర్తికాదని, వాటికి క్రమం తప్పకుండా నీరు పోసి, సంరక్షిస్తూ పెద్దవిగా పెంచాలని సూచించారు. మొక్కలు మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను అందించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకాన్ని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించాలని కోరారు. ఒక్క మొక్క నాటితే భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించినట్టేనని, మొక్కను నాటడం కన్నా దాన్ని బతికించి పెంచడమే నిజమైన పర్యావరణ సేవ అని దుంపెన రమేష్ పేర్కొన్నారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
3
సోమవారం 28.09.2026
www.kalamjyothi.com

సీఈసీ రాజీనామా చేయాల్సిందే

- కేంద్ర ఎన్నికల కమిషనర్ తీరుపై కూచాడి ఆగ్రహం
- నేడు రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు
- కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలి
- నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరిరావు



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 27) : కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలికి నిరసనగా, ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలో భారీ ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు తెలిపారు. ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 28 సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక అర్డీవో కార్యాలయం నుంచి నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందని ఆయన వెల్లడించారు. ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగుతుందని, అనంతరం అక్కడ కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేయనున్నట్లు కూచాడి శ్రీహరి రావు పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, పార్టీకి చెందిన వివిధ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత వైఖరికి వ్యతిరేకంగా చేపట్టే ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కూచాడి శ్రీహరి రావు పిలుపునిచ్చారు.

చెలికాని సేవలు వెలకట్టలేనివి

- న్యాయవాద లోకానికి గర్వకారణం
- యువ న్యాయవాదులకు ఉపాధి, భరోసా కల్పించాలి

కలంజ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం (సెప్టెంబర్ 27) : తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సీనియర్ న్యాయవాది చెలికాని వెంకట యాదవ్ ను ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్వైసీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మద్దిశెట్టి సామేలు హైదరాబాద్‌లోని తన నివాసంలో అత్యంత ఆత్మీయంగా, ఘనంగా సన్మానించారు. న్యాయవాద వర్గంలో తనదైన విశేష సేవలందిస్తూ ఉన్నత స్థానానికి ఎదిగిన ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధి, భరోసా కల్పించాలి..

ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ.. న్యాయం కోసం నిలబడే నిఖార్సయిన గొంతుకగా చెలికాని వెంకట యాదవ్ నిరూపించుకున్నారని, అలాంటి ఉత్తమ వ్యక్తి బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ కావడం యావత్ తెలంగాణ న్యాయవాద లోకానికే గర్వ కారణమని కొనియాడారు. గత పదేళ్లుగా తనపై, తమ పార్టీపై వచ్చిన అత్యంత క్లిష్ట మైన కేసులను చాకచక్యంగా వాదించి న్యాయం సాధించారని గుర్తుచేశారు. ఈ భేటీలో రాష్ట్రం లో న్యాయవాదుల సంక్షేమం, బార్ కౌన్సిల్ బలోపేతం, యువ న్యాయవాదులకు తగిన భరోసాతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించ డం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. చెలికాని వెంకట యాదవ్ పదవీకాలంలో న్యా యవాదుల ఆత్మగౌరవాన్ని మరింత ఇనుమడిం పజేస్తారని మద్దిశెట్టి సామేలు ఆకాంక్షించారు.



ఇసుక అక్రమ రవాణా

- పదిర శివారులో 4 ట్రాక్టర్ల ఇసుక తరలింపు
- వెంబడించిన కారు.. అదుపుతప్పి బోల్తాపడిన ట్రాలీ
- దర్యాప్తు చేపట్టిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్



కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 27) : ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో మండలంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నమైన అదను చూసి అక్రమార్కులు యథేచ్ఛగా ఇసుక దందా సాగించినట్లు సమాచారం. ఎల్లారెడ్డిపేట మండల పరిధిలోని పదిర గ్రామ శివారు చిట్టివాగు నుంచి శనివారం అర్ధరాత్రి నాలుగు ట్రాక్టర్లలో అనుమతులు లేకుండా ఇసుక తరలించినట్లు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పదిర, గొల్లపల్లి గ్రామాలకు చెందిన వ్యక్తులవిగా చెబుతున్న ఈ ట్రాక్టర్లు రాత్రివేళ దర్జాగా ఇసుకను తరలిస్తుండగా, గుర్తుతెలియని వ్యక్తులు కారులో వాటిని వెంబడించినట్లు తెలిసింది. కారు తమను వెంబడిస్తున్న విషయాన్ని పసిగట్టిన ఓ ట్రాక్టర్ డ్రైవర్ వేగం పెంచడంతో ట్రాలీ ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తాపడింది. అదృష్టవశాత్తూ ట్రాలీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

గుట్టుచప్పుడు కాకుండా ట్రాలీ తరలింపు..

ప్రమాదం జరిగిన వెంటనే బోల్తాపడిన ట్రాలీని సంఘటనా స్థలం నుంచి గుట్టుచప్పుడు కాకుండా ఇతర ప్రాంతానికి తరలించడం పలు అనుమానాలకు తావిస్తోంది. అసలు ఆ ట్రాక్టర్ ఎవరిది? డ్రైవర్ ఎవరు? మిగిలిన మూడు ట్రాక్టర్ల యజమానులెవరు? అనే అంశాలు మిస్టరీగా మారాయి. మరోవైపు ఇసుక ట్రాక్టర్లను కారులో వెంబడించిన ఆ వ్యక్తులు ఎవరు? వారికి సమాచారం ఎలా వచ్చింది? అధికారులకు ఫిర్యాదు చేయకుండా వారే ఎందుకు వెంబడించారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ట్రాక్టర్ బోల్తాపడిన తర్వాత ఇరువర్గాల మధ్య పెద్ద ఎత్తున బేరసారాలు జరిగినట్లు, భారీగా ముడుపులు చేతులు మారినట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

విచారణ చేపట్టిన సీఐ వెంకటేష్..

ఈ అక్రమ రవాణా వ్యవహారంపై ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్ ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఇసుక తరలింపునకు పాల్పడిన నాలుగు ట్రాక్టర్ల వివరాలు, డ్రైవర్లు, ప్రమాదానికి గురైన వాహనం ఎవరి ఆదేశాలతో తరలించబడింది, వెంబడించిన కారులోని వ్యక్తులు ఎవరు, వారి మధ్య జరిగిన రాజీ వ్యవహారాలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ యంత్రాంగం దృష్టి మరలిన సమయంలో సాగిన ఈ ఇసుక దందాపై సమగ్ర విచారణ జరిపి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఘనంగా బొజ్జ గణపయ్య నిమజ్జనం

కలంజ్యోతి, నర్సాపూర్ (సెప్టెంబర్ 27) : హత్నూర మండల పరిధిలోని సదులనగర్ గ్రామంలో బోనమ్మ వినాయక కమిటీ ఆధ్వర్యంలో 13 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య నిమజ్జనోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నిమజ్జన వేడుకలకు ముఖ్య అతిథిగా హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో మొదటి లడ్డూను రూ.40,500లకు మూత వెంకటేశం దక్కించుకోగా, రెండవ లడ్డూను రూ.17,000లకు తలారి లక్ష్మయ్య కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా బోనమ్మ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలోని పిల్లాపాపలను, ప్రజలందరినీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో చల్లగా చూడాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఏటా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు చేపట్టి నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డితో పాటు మూత వెంకటేశం, తలారి లక్ష్మయ్య, సదులనగర్ గ్రామ పెద్దలు, మహిళలు, బోనమ్మ యూత్ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కూతుళ్లే మా బలం.. మా ఆనందం..

కలంజ్యోతి, ఎల్లారెడ్డిపేట (సెప్టెంబర్ 27) : కూతురు అంటే ఇంటికి వెలుగు, తల్లిదండ్రుల జీవితంలో మరపురాని అనుబంధం అని నిరూపిస్తూ మండల కేంద్రానికి చెందిన శ్యామ జయ, శ్యామ రాజప్రకాష్ దంపతుల కుటుంబం ఆదర్శంగా నిలుస్తోంది. అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవం (డాటర్స్ డే) సందర్భంగా ఆ ఇంట్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. వీరికి పెద్ద కూతురు పూజ, చిన్న కూతుళ్లు కవలలైన మానుష, మంజూష ఉన్నారు. ముగ్గురు ఆడపిల్లలే జన్మించిన తొలినాళ్లలో ఇరుగుపొరుగు మాటలతో కొంత బాధగా అనిపించినప్పటికీ, ఆ తర్వాత తమ కుటుంబం ఎంతో ఆనందంగా ఉందని ఆ దంపతులు పేర్కొన్నారు. పెద్ద కూతురు పూజ, రెండో కూతురు మనోజల వివాహాలు జరిపించామని తెలిపారు. కవలలైన మానుష, మంజూష తమ అల్లరి, ఆప్యాయతల తో ఇంటిని ఎల్లప్పుడూ సందడిగా మార్చిన అనుభూతిని ఎన్నటికీ మర్చిపోలేమని వివరించారు. ముగ్గురు కూతుళ్ల మధ్య ఉన్న ప్రేమానుబంధాలు కుటుంబ సభ్యులకు ఎనలేని సంతోషాన్ని ఇస్తున్నాయని చెప్పారు. డాటర్స్ డే సందర్భంగా తమ కూతుళ్లను ప్రేమగా అభినందిస్తూ వారు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, జీవితంలో గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ ముగ్గురు కూతుళ్లే తమ బలం, తమ ఆనందం, తమ సర్వస్వమని శ్యామ జయ, శ్యామ రాజప్రకాష్ దంపతులు ఎంతో గర్వంగా తెలిపారు.





కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
4
సోమవారం 28.09.2026
www.kalamjyothi.com

ఉగ్రవాదాన్ని భారత్ సహించదు

- సర్జికల్ స్ట్రైక్‌కు పదేళ్లు..
- పాక్ స్థావరాలపై దాడులు సరికొత్త విధానానికి నిదర్శనం
- అశోక్ సింఘాల్ సమాజంలో తపస్వీలా జీవించారు
- గ్రామీణ హాకీకి వెన్నుదన్నుగా నిలిచిన రాజిందర్ సింగ్
- ప్రకృతి పరిరక్షణతో సుందర్‌బన్స్ మహిళల సాధికారత
- మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



కలంజ్యోతి, న్యూఢిల్లీ (సెప్టెంబర్ 27) : భారత సైన్యం సరిహద్దులు దాటి పాకిస్తాన్‌లోని ఉగ్ర వాద శిబిరాలపై సర్జికల్ స్ట్రైక్ చేసి పదేళ్లు పూర్తవు తున్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ భారత సైనికుల అసమాన ధైర్యసాహసాలను ఘనంగా కొనియా డారు. ఆదివారం నిర్వహించిన 138వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 2016 సెప్టెంబర్ 28 29 తేదీల్లో భారత సైన్యం నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) దాటి శత్రు మూకలపై మెరుపు దాడి నిర్వహించిందని గుర్తుచేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని ఆధునిక భారత దృఢ వైఖరికి సర్జికల్ స్ట్రైక్ గొప్ప నిదర్శనమని ప్రధాని స్పష్టం చేశారు.

అశోక్ సింఘాల్, మొధేరా సూర్యదేవాలయ విశేషాలు..

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత, ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అశోక్ సింఘాల్ శతజయంతి సందర్భంగా ప్రధాని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. 1926 సెప్టెం బర్ 27న ఆగ్రాలో జన్మించిన అశోక్ సింఘాల్ సమాజంలో ఉంటూనే తపస్వీలా జీవించారని, రామజన్మభూమి ఉద్యమానికి దిశా నిర్దేశం చేసి కొత్త ఉత్సాహాన్ని నింపారని కొనియాడారు. అలాగే గుజరాత్‌లోని మొధేరా సూర్య దేవాల యానికి వెయ్యేళ్ల చరిత్ర పూర్తయిందని తెలిపారు. 1025లో రాజా భీమదేవుడు నిర్మించిన ఈ చా రిత్రక ఆలయం ఉన్న మొధేరా ప్రాంతం నేడు దేశంలోనే తొలి 'సోలార్ విలేజ్'గా రూపాంతరం చెంది, గతంఆధునికతల అనుసంధానానికి ప్రతీ కగా నిలిచిందన్నారు.

సుందర్‌బన్స్ మహిళల సాహసం..

దేశవ్యాప్తంగా సాగుతున్న పర్యావరణ పరిర క్షణ కార్యక్రమాలను ప్రధాని ప్రశంసించారు. అసోంలో ప్రకృతి సంరక్షణతో సానుకూల మార్పులు వస్తున్నాయని చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లోని సుందర్‌బన్స్ పరిధిలోని ఝార్ఖాలి ప్రాంతంలో పులి దాడుల్లో భర్తలను కోల్పోయిన మహిళలు మాంగ్రూవ్ అడవులను పెంచుతూ తీర ప్రాంతాలకు రక్షణ కవచంలా నిలుస్తున్నా రని తెలిపారు. ఈ చెట్లు గ్రామాలను తుపాన్ల నుంచి కాపాడటంతో పాటు మహిళలకు ఉపాధి కల్పిస్తూ పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు ఆదర్శంగా మారాయని వివరిం చారు. ఇదే క్రమంలో లక్షలాది యువత 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా మాదకద్రవ్యా లకు దూరంగా ఉంటా మని ప్రతిజ్ఞ చేయడం శుభపరిణామమని పేర్కొన్నారు.

స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం..

క్రీడారంగంలో గ్రామీణ హాకీ ప్రతిభను వెలికితీ సేందుకు మాజీ క్రీడాకారుడు రాజిందర్ సింగ్ సీనియర్ చేస్తున్న నిరంతర కృషిని ప్రధాని అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన శిక్షణ, వనరులు అందిస్తే అద్భుతమైన క్రీడా కారులు వెలుగులోకి వస్తారని పేర్కొన్నారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని ప్రతాప్‌గఢ్‌లో ఆవాల ప్రాసెసింగ్ ద్వారా పండకు పైగా యూనిట్లు ఏర్పాటయ్యాయని, దేవ్‌గఢ్ కమాసీ గ్రామం లోని సావిత్రీ ఫూలే స్వయం సహాయక సంఘం మహిళలు ఆవాలతో క్యాండీ, మురబ్బా, జ్యూస్ ఉత్పత్తులు తయారు చేస్తూ ఓడీఓపీ ద్వారా మంచి లాభాలు ఆర్జిస్తున్నారని ప్రశం సించారు. దేశ సంస్కృతి, వారసత్వంతో పాటు స్థానిక ప్రజల భాగస్వామ్యంతోనే సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.


వడ్రంగికి తీవ్ర గాయాలు

సకాలంలో స్పందించి ప్రాణాలు నిలిపిన 108 సిబ్బంది

కలంజ్యోతి, నెక్కొండ (సెప్టెంబర్ 27) : వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న ఓ కార్మికుడిని పనిలో జరిగిన అనుకోని ప్రమాదం తీవ్ర గాయాలపాల్జే సింది. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన అడ్లూరి వీరచారి (40) వడ్రంగి పనిలో నిమగ్నమై ఉండగా, పేపర్ కొట్టే మిషన్ ఒక్కసా రిగా అదుపుతప్పి ఛాతి ఎడమ వైపు బలంగా తాకింది. దీంతో తీవ్ర రక్తస్రావమై ఆయన అక్క డికక్కడే కుప్పకూలిపోయారు. స్థానికుల సమా చారంతో నెక్కొండ 108 సిబ్బంది ఈఎంటీ ఉపేందర్, పైలట్ రమేష్ వెంటనే సంఘటనా స్థ లానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వేళ వేగంగా స్పందించి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది



ఉపేందర్, రమేష్‌ల సేవలను గ్రామస్థులు ప్రత్యే కంగా అభినందించారు.



చిన్నారికి రాణాప్రతాప్‌రెడ్డి ఆశీస్సులు

కలంజ్యోతి, చెన్నారావుపేట (సెప్టెంబర్ 27) : నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన యువ నాయకుడు మర్ర సతీష్, వెన్నెల దంపతుల కుమార్తె రిత్విష నూతన వస్త్ర ఫల పు ష్పాలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ కా ర్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్య దర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి హాజరై చి న్నారిని ఆశీర్వదించారు. చిన్నారుల చిరునవ్వులు కుటుంబానికి ఎనలేని ఆనందాన్ని, సమాజానికి ఆశాకిరణాన్ని అంది స్తాయని, చిన్నారి ఆయురారోగ్యాలతో వర్ధిల్లాల ని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు శుభాకాంక్ష లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూలూరి మనీష్, కొంకిస విగ్నేష్, ఠాకూర్ విజయ్ సింగ్, సందీప్ రెడ్డి, కర్ణాకర్, భాను, ప్రశాంత్ తదితరు లు పాల్గొన్నారు.

41 కొత్త బార్లకు నోటిఫికేషన్

- నేటి నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తుల స్వీకరణ

కలంజ్యోతి, హైదరాబాద్ (సెప్టెంబర్ 27) : తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా 41 'టూబీ' (2B) బార్ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి కలిగిన అభ్యర్థులు, సంస్థల నుంచి సెప్టెంబర్ 28వ తేదీ నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారు లు వెల్లడించారు. ఒక్కో దరఖాస్తుకు ప్రాసెసింగ్ ఫీజుగా రూ.1 లక్ష నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ పరిధిలో 14 బార్ల ఏర్పాటు..

రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేయనున్న మొత్తం 41 బార్లలో అత్యధికంగా జీహెచ్ఎంసీ పరిధిలోనే 14 బార్లను ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన 27 బార్లను రాష్ట్రంలోని ఇతర మున్సిపల్ కార్పొరేష న్లు, మున్సిపాలిటీల పరిధిలో నెలకొల్పనున్నారు. అర్హత గల వ్యాపారులు, వ్యక్తులు నిర్దేశిత గడువు లోగా దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. ఈ రుసుముతో పాటు లైసెన్స్ మంజూరు, బార్ ఎక్సైజ్ పన్ను తదితర అంశాలు సంబంధిత ప్రాంత జనాభా ప్రాతిపదికన ఎక్సైజ్ శాఖ నిబం ధనల ప్రకారం వర్తిస్తాయని అధికారులు పేర్కొ న్నారు.

అక్టోబర్ 12 వరకు మాత్రమే తుది గడువు..

ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం కొత్త 2B బార్ ప్రీక్లి యరెన్స్ కోసం ఫారమ్ 1(A), అనంతరం దరఖాస్తు కోసం ఫారమ్ 1(B) సమర్పించాల్సి ఉంటుంది. కొత్త లైసెన్సుల జారీ ద్వారా ప్రభుత్వానికి భారీగా ఎక్సైజ్ ఆదాయం సమకూరనుంది. లైసెన్స్ దక్కిం చుకున్న వ్యాపారులు నిర్దేశిత వ్యాపార వేళలు, వయస్సు పరిమితులు, మద్యం విక్రయ నిబంధన లను తప్పక పాటించాలని శాఖ హెచ్చరించింది. అక్టోబర్ 12 తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిగ ణనలోకి తీసుకోబోమని, పూర్తి వివరాలు, ఫీజుల సమాచారాన్ని అధికారిక పోర్టల్‌లో పరిశీలించుకో వాలని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది.

నేటి నుంచి 3రోజుల బ్యాంక్ సమ్మె

కలంజ్యోతి, న్యూఢిల్లీ (సెప్టెంబర్ 27) : దేశవ్యా ప్తంగా సోమవారం (సెప్టెంబర్ 28) నుంచి మూడు రోజుల పాటు బ్యాంకుల సమ్మెకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు బ్యాంకు ఉద్యోగులు సమ్మె బాట పట్టనుండటంతో వరుసగా మూడు రోజుల పాటు సాధారణ బ్యాంకింగ్ సేవలకు తీవ్ర అంతరాయం కలగనుంది. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఈ ఆందోళన వల్ల ఖాతాదారులు లావాదేవీల పరంగా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏర్ప డ్డాయి.

వారానికి 5 రోజుల పనే ప్రధాన డిమాండ్..

బ్యాంకింగ్ రంగంలో వారానికి 5 రోజుల పని దినాల నిబంధనను తక్షణమే అమలు చేయా లన్నదే ఉద్యోగ సంఘాల ప్రధాన డిమాండ్‌గా



ఉంది. ప్రస్తుతం బ్యాంకులకు ప్రతినెలా రెండు, నాల్గవ శనివారాలు మాత్రమే సెలవులు ఉండగా, మిగిలిన వారాల్లో ఆరు రోజులు పని చేస్తున్నారు. అన్ని శనివారాలనూ సెలవులుగా ప్రకటించి వారానికి ఐదు రోజుల విధానాన్ని తేవాలని యూనియన్లు పట్టుబడుతున్నాయి. దీనితో పాటు పెన్షన్ సవరణ, డీఏ పెంపు, సర్వీస్ నిబంధనల సవరణ వంటి ఇతర సమస్యలను ప్రభుత్వం ముందుంచాయి. సెప్టెంబర్ 22న జరిగిన చర్చ ల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో సమ్మెను కొనసాగించాలని సంఘాలు నిర్ణయించాయి.

ప్రభావితం కానున్న సేవలు..

సమ్మె దృష్ట్యా ఖాతాదారుల సౌకర్యార్థం సెప్టెంబ ర్ 27 ఆదివారం నాడు బ్యాంకులు ప్రత్యేకంగా తెరిచి ఉంచడంతో పాటు, అత్యవసర పనులను ముందే పూర్తి చేసుకోవాలని వినియోగదారుల కు సంక్షిప్త సందేశాలు పంపాయి. ఈ మూడు రోజుల సమ్మె కాలంలో బ్యాంకు శాఖల్లో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాయల్స్, చెక్కుల క్లియరెన్స్, కేవైసీ అప్‌డేట్ వంటి ప్రత్యక్ష సేవలు నిలిచిపో నున్నాయి. అయితే డిజిటల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ (ఫోన్‌పే, గూగుల్‌పే తదితర) లావాదేవీలు యథావిధిగా కొనసాగుతా యని స్పష్టమైంది. బ్యాంకు శాఖల మూసివేత ప్ర భావంతో ఏటీఎంలలో నగదు కొరత ఏర్పడే అవ కాశముందని అధికారులు హెచ్చరిస్తున్నారు.



పోలీసు ఉచిత శిక్షణ 30కి వాయిదా

కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 27) : నిర్మల్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, కలెక్టర్ భవేష్ మిశ్రా సహకారంతో నిరుద్యోగ యువత కోసం నిర్వహించనున్న ఉచిత ప్రీక్రూట్‌మెంట్ శిక్షణ తరగతులు అనివార్య కారణాల వల్ల ఈ నెల 28వ తేదీకి బదులుగా 30 నుంచి ప్రారంభం కానున్నాయని ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ తదితర ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పరిధిలో ని పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను సంప్రదించి, బయోడేటా సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు. అభ్యర్థుల తేదీల మార్పును గమనించి, ఈ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని ఎస్పీ జానకి షర్మిల కోరారు.

కలంజ్యోతి
తెలుగు దినపత్రిక
5
సోమవారం 28.09.2026
www.kalamjyothi.com

పాలమూరు రైతులను రేవంత్ ముంచిండు

కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 27) : పాలమూరు బిడ్డనని చెప్పుకుంటూనే ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత రైతాంగాన్ని నిలువునా ముంచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తా రు. కృష్ణా నదిలో పుష్కలంగా నీరున్నా పంపులు నడిపి పంటలకు ఇవ్వకుండా తన గురువు ముందు పిల్లిలా మారిపోయారని విమ ర్శించారు. నాగర్‌కర్నూల్ మండలం దేశిఇటి క్యాల గ్రామంలో ఎండిపోయిన పత్తి, మొక్కజొ న్న పంట పొలాలను ఆయన ఆదివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొల్లాపూర్ పర్యటన ముగించుకుని తిరిగి వెళ్తుండగా రైతులు రోడ్డుపై ఆపి గోడు వెళ్లబోసుకోవడంతో ఆయన పొలాల్లోకి వెళ్లి రైతులను పరామర్శిం చారు. పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు వాపోయారు.

ఉమ్మడి జిల్లాలో 40 శాతం పంట నష్టం..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నీళ్లు లేక 40 శాతానికి పైగా పంటలు తీవ్రంగా దెబ్బతి న్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి చేలు ఎండిపోయి రంగు మారడంతో క్వింటాల్‌కు రూ.4 వేలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. రెండు ఎకరాల్లో మొక్కజొన్న సాగు కోసం రూ.2 లక్షలు అప్పు తెచ్చి పెట్టు బడి పెట్టిన శేఖర్‌రెడ్డి అనే రైతుతో పాటు లక్ష్మ య్య, యాదమ్మ వంటి ఎంతోమంది రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఇటీవల చిరుజల్లులు పడి పొలాలు పైకి పచ్చగా కనిపిస్తున్నా లోపల పంటలు పూర్తిగా నాశనమయ్యాయని వివరించారు.

పంపులు నడపకుండా పిల్లిలా మారారు..

నదుల్లో నీళ్లు లేక కరువు రాలేదని, 248 టీఎంసీల మేర నీటి లభ్యత ఉన్నా ఎత్తిపోయ కుండా ప్రభుత్వం కృత్రిమ కరువు తెచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని నిపుణులు ముందే హెచ్చరిం చినా చెరువులు నింపలేదన్నారు. కల్వకుర్తి, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకాలను పూర్తి సామర్థ్యంతో నడపకుండా నిర్లక్ష్యం వహి స్తున్నారని ధ్వజమెత్తారు.

సాగునీరు ఇస్తే పంటలు పండుతాయని, ఆ తర్వాత కొనుగోళ్లు, బోనస్, ఎరువుల బాధ్యత తమపై పడుతుందనే దురుద్దేశంతోనే సర్కారు నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. పక్కనే ఉన్న పాలమూరు ఎండిపోతుంటే కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారని ఎండగట్టారు.

కరెంట్ కోతలు.. మోసపోయిన రైతులు..

రైతులకు సాగునీరు ఇవ్వకపోవడమే కాకుండా విద్యుత్ విషయంలోనూ తీవ్ర అన్యాయం చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి 7 గంటలు దాటితే సింగిల్ ఫేజ్ కరెంట్ ఇస్తున్నారని, త్రీఫేజ్ వచ్చినా తరచూ అంతరాయాలు కలుగుతుం డటంతో మోటార్లు నడవడం లేదని స్థానిక రైతు బాలపీర్ చెప్పిన విషయాన్ని ప్రస్తావించా రు. ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు పూర్తి స్థాయిలో రుణమాఫీ కాక, కరెంట్ లేక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో జూరాల, కల్వకుర్తి, నె ట్టెంపాడు ప్రాజెక్టులతో 8.5 లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తుచేశారు.

తక్షణ పరిహారం చెల్లించాలి..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో దెబ్బతిన్న ప్రతి ఎకరాన్ని అధికారులు వెంటనే సర్వే చేసి పంట నష్టాన్ని అంచనా వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతులు బంగారం కుదువపెట్టి, అప్పులు తెచ్చి సాగు చేశారని, వారిని ఆదు కోవడానికి ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి, అధికారులను కలిసి రైతుల సమస్యలపై నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు శాసనసభ లోపల, బయట బీఆర్ఎస్ ఎమ్మె ల్యేలతో కలిసి పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. అన్నదాతలు ఎవరూ అధైర్య పడవద్దని ఆయన భరోసా ఇచ్చారు.



ప్రకృతి పులకరించే అందాల లోకం




కలంజ్యోతి, నాగర్‌కర్నూల్ (సెప్టెంబర్ 27) : ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నాగ ర్‌కర్నూల్ జిల్లాలోని ప్రకృతి సోయగాలు, చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రాలు సందర్శకులను విశే షంగా ఆకట్టుకుంటున్నాయి. దట్టమైన అడవులు, ఎత్త యిన కొండలు, జాలువారే జలపాతాలు, కృష్ణమ్మ జలసిరుల సమ్మేళనంగా విలసిల్లుతున్న నల్లమల ప్రాంతం ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంగా మారింది. ఇక్కడి అద్భుత సౌందర్యాన్ని ఒక్కసారి ఆస్వాదిస్తే జీవితంలో మర్చిపోలేని అనుభూతిని మిగిల్చి, మరోసారి రమ్మని ఆహ్వానించేలా నాగర్‌క ర్నూల్ పర్యాటక కేంద్రాలు విరాజిల్లుతున్నాయి.

అరుదైన వన్యప్రాణులు..

దేశంలోనే పేరొందిన అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోని మన్ననూర్ ప్రాంతంలో పచ్చదనం, ప్రశాంత వాతావరణం పర్యాటకులకు సరికొత్త అనుభవాన్ని అందిస్తున్నాయి. ఇక్కడి దట్టమైన అడవుల్లో విహరించే అరుదైన వన్యప్రాణులు, విభిన్న పక్షిజాతులు సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి. నల్లమల కొండల నడిబొడ్డున ఉన్న ఫరహాబాద్ వ్యూ పాయింట్ ప్రకృతి సోయగాలకు ప్రతీకగా నిలుస్తోంది. కొండ అంచుల నుంచి వి స్తరించిన అటవీ అందాలు, వీచే చల్లని గాలులు, ఆహ్లాదకరమైన వాతావరణం పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

ఉమామహేశ్వరంలో ఆధ్యాత్మికం..

పచ్చని అడవుల మధ్య ఎత్తయిన రాతిగుట్టలపై నుంచి పాలధారలా జాలువారే మల్లెలతీర్థం జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోం ది. కొండల మధ్య కొలువైన ఉమామహేశ్వర క్షేత్రం అటు ఆధ్యాత్మికతకు, ఇటు ప్రకృతి సౌంద ర్యానికి అద్భుత నిలయంగా భాసిల్లుతోంది. కృష్ణా



నది, శ్రీశైలం బ్యాక్‌వాటర్ తీరాన ఉన్న సోమశిల మరో ప్రధాన ఆకర్షణగా మారింది. విస్తారమైన జలరాశి, పచ్చని కొండల నడుమ బోటింగ్, జల విహారం చేస్తూ సమయం గడపడానికి ప్రకృతి ప్రేమికులు ఇక్కడికి భారీగా తరలివస్తున్నారు.


పర్యాటక పాలసీతో స్థానికులకు ఉపాధి..

నల్లమల ప్రాంతంలో ప్రకృతి, వన్యప్రాణి, ఆధ్యా త్మిక, సాహస పర్యాటకానికి అపారమైన అవ కాశాలున్నాయి. తెలంగాణ పర్యాటక విధానం 2025/30లో 'నల్లమల సర్క్యూట్'కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం కల్పించింది. ఈ సర్క్యూట్ ద్వారా అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, ఫరహాబాద్, సలేశ్వరం, మల్లెలతీర్థం, మన్ననూర్, ఉమామ హేశ్వరం తదితర ప్రాంతాలను సమగ్రంగా అభి వృద్ధి చేయనున్నారు. దీనివల్ల స్థానిక గిరిజనుల కు, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక ప్రగతికి బాటలు పడనున్నాయి.

ప్రకృతి సంపదను కాపాడాలి..

నల్లమల అడవులను సందర్శించే పర్యాటకులు అటవీ శాఖ నిబంధనలను తప్పక పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అడవుల్లోకి ప్లాస్టిక్ వస్తువులు తీసుకెళ్లడం, వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయడం నిషేధమని హెచ్చరించారు. మూగ వన్యప్రాణులకు ఎటువంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయు తంగా వ్యవహరించాలని కోరారు. అద్భుతమైన ఈ ప్రకృతి వనరులను, పచ్చదనాన్ని కాపాడుకుం టేనే భావితరాలకు స్వచ్ఛమైన అందాలను అం దించగలమని, అందరూ కలిసి ప్రకృతి సంపదను సంరక్షించాలని పిలుపునిచ్చారు.





తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన బాపూజీ

- బాపూజీ త్యాగం చిరస్మరణీయం
- ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి
- కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలో వక్తలు



కలంజ్యోతి, నిర్మల్ (సెప్టెంబర్ 27) : తెలంగాణ సమాజం కోసం తన సమస్త జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ ప్రజానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలువురు వక్తలు ఘనంగా కొనియాడారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బాపూజీ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి తదితరులు పాల్గొని విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

బాపూజీ త్యాగం చిరస్మరణీయం..

మహాత్మా గాంధీ స్ఫూర్తితో నాడు స్వాతంత్ర్య పోరాటం మొదలుకొని ప్రత్యేక తెలంగాణ సాధన వరకు బాపూజీ చేసిన ఉద్యమాలు, త్యాగాలు చిరస్మరణీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పేర్కొన్నారు. మంత్రి పదవిని సైతం తృణప్రాయంగా త్యజించి తెలంగాణ వాణిని వినిపించిన మహనీయు డని గుర్తుచేశారు. ఆయన చూపిన బాటను నేటితరం ఆదర్శంగా తీసుకుని ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మాజీ చైర్మన్ గంద్రత్ ఈశ్వర్, కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవ్, నాయకులు చిలుక రమణ, రామలింగం, రాములు పాల్గొన్నారు.

ఆశయ సాధనే ఆయనకు నిజమైన నివాళి..

జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికా రుల ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నిజాం నిరంకుశ పాలనపై పోరాడి, వృద్ధాప్యంలోనూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఢిల్లీ వేదికగా ఆమరణ నిరాహార దీక్ష చేసిన ధీరోదాత్తుడని అధికారులు, సంఘాల నాయకులు గుర్తుచే శారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ముద్దుబిడ్డ కావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన నిరంతర కృషిని స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను భవిష్యత్ తరాలకు అందించడమే అసలైన నివాళి అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, ఏబీసీడబ్ల్యూవో సత్యనారా యణ, వివిధ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలం జ్యోతి
తెలుగు దినపత్రిక

డిప్రెషన్‌తో సినిమాలకు దూరమయ్యా

వ్యక్తిగత కారణాలు, తీసుకున్న కొన్ని తప్పుడు నిర్ణయాల వల్ల తీవ్రమైన డిప్రెషన్, ఒత్తిడిని ఎదుర్కొన్నానని ప్రముఖ నటి నివేతా పేతురాజ్ తెలిపారు. త్వరలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్న ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 2023లో ఎదురైన కష్టకాలం వల్ల సినిమాలను పూర్తిగా వదిలేయాలని భావించానని, అయితే పరిస్థితులు చక్కబడి మంచి అవకాశాలు రావడంతో తిరిగి నటనపై దృష్టి పెట్టానని పేర్కొన్నారు. కెరీర్ ప్రారంభంలో పెదవులకు సర్జరీ చేయించుకోవాలనుకున్నా, వైద్యుడి హెచ్చరికతో విరమించుకున్నట్లు చెప్పారు. సాయి పల్లవి, నిత్యామీనన్ సహజ సౌందర్యంతో రాణించడం చూశాకే సర్జరీ ఆలోచనను శాశ్వతంగా వదులుకున్నానని నివేతా పేతురాజ్ వివరించారు.